

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ



### సయ్యాన్ బినా ఘర్ సూనా

'ఆంగన్ కీ కలీ' సినిమాలో లతా మంగేష్కర్, భూపేంద్ర సింగ్‌లూ అత్యద్భుతంగా గానం చేసిన ఈ రుమ్రీ గీతాన్ని రచించింది శైలీ శైలేంద్ర. సంగీత దర్శకత్వం వహించింది బప్పీలహరి. తొమ్మిది రోజుల తేడాలో సంగీత సరస్వతి లౌకిక స్వరం అయిన లతామంగేష్కర్, డిస్కో రాజా అయిన బప్పీలహరి భూలోకం విడిచి వెళ్లిపోయారు. ఈ పాట రాసిన శైలీ శైలేంద్ర కూడా మరణించాడు. కళాకారుడిని కళ సజీవంగా నిలుపుతుంది. అతని కళద్వారా చిరంజీవిగా నిలిచే కళాకారుడు తరతరాలుగా ఆనందాన్ని అందిస్తాడు. బప్పీలహరి అయినా, లతా మంగేష్కర్ అయినా కళాకారుడి మరణానికి బాధపడనవసరంలేదు. ఎందుకంటే భౌతికమైనదేదైనా నశించవలసిందే. కానీ భౌతిక శరీరంలో ఒదిగిన అనంతమైన ఆత్మ సృజించిన అలౌకికమైన కళకు మరణం లేదు. అది భౌతికమైన శరీరపు ఆనవాళ్లను కూడా చిరంజీవిగా నిలుపుతుంది.

బప్పీలహరి అనగానే అందరికీ 'డిస్కో' పాటలు గుర్తుకు వస్తాయి. భారతీయ సినీ ప్రపంచానికి డిస్కోను పరిచయం చేసింది 'బిద్దు అప్పయ్య' అయినా తుఫాను సృష్టించి సినీ సంగీత స్వరూపాన్ని సంపూర్ణంగా రూపాంతరమొందించింది బప్పీలహరి. జాన్ ట్రవోల్టా, సాటర్ డే నైట్ ఫీవర్‌తో ప్రపంచానికి జ్వరం అంటించినా, బప్పీ లహరి 'రంబ హో, సాంబహో ' 'హరి ఓం హరి' అనేదాకా భారతీయ సినిమాలకు డిస్కో జ్వరం అంటలేదు. ఒక్కసారి అంటిన తరువాత అన్నిటినీ డిస్కోమయం చేసిగానీ వదలలేదు. ఈ డిస్కో జ్వరం ఎంత తీవ్రమైనదంటే అంతవరకూ స్థిరపడి ఉన్న సంగీత దర్శకులంతా ఉక్కిరి బిక్కిరయ్యారు. కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ, ఆర్డీబర్మన్ వంటి వారు సినిమాలు లేని దుస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది. మెలోడీపై ఆధారపడే రాకేష్ రోషన్ 'మై ఎక్ డిస్కో, తూ ఎక్ డిస్కో, దునియా హై ఎక్ డిస్కో' అంటూ పాడాల్సి వచ్చింది. లక్ష్మీకాంత్ ప్యారేలాల్ మాత్రం అత్యంత ప్రామాణికమైన డిస్కో పాటలు సృష్టిస్తూ, శాస్త్రీయ సంగీత రాగాల ఆధారితమైన మధురమైన గీతాలను సృజిస్తూ ఎడారిలో పన్నీటి జల్లులలాంటి గీతాలను

అందిస్తూ బప్పీలహరి తుఫానుకు తట్టుకుని నిలబడగలిగారు. పాటలు పాడే విధానం మారిపోయింది. పాటలు పాడే స్వరాలు మారిపోయాయి. అది పెనుమార్పులు ఉక్కిరి బిక్కిరి చేసిన కాలం.

పాప్ పాటలు శాస్త్రీయ రాగాల ఆధారిత పాటలకు సవాళ్లు విసిరాయి. లయ మాధుర్యాన్ని వెనక్కు నెట్టిన కాలం. ఈ వ్యవస్థకు 'షాక్ ' ఇచ్చింది బప్పీలహరి. సింథసైజర్ స్వరానికి ప్రతిరూపంగా ఎదిగాడు బప్పీలహరి. పాటలలో కవిత్వం అదృశ్యమై బాణీలో ఒదిగే పదాల కూర్పులా దిగజారాయి పాటలు. ఇదే సమయానికి దక్షిణాది నిర్మాతలు హిందీ సినీరంగంపై ఆధిక్యం సంపాదించి 'హిట్' పాట తప్ప పాటలలో మాధుర్యం లేని పరిస్థితిని నెలకొల్పారు. ఈ మార్పునంతటినీ ముందుండి నడిపించింది బప్పీలహరి. అందుకే బప్పీ లహరి అంటే డిస్కో పాటలు గుర్తుకు వస్తాయి. సినిమా పాటలను దిగజార్చిన వాడన్న విమర్శ వినిపిస్తుంది. విజయం కోసం విదేశీ బాణీలను ఎత్తుకొచ్చిన వాడన్న దూషణ కూడా వినిపిస్తుంది.

అయితే, బప్పీలహరి సృజించిన పాటలను పరిశీలిస్తే, నిజానికి డిస్కో పాటలన్నది బప్పీలహరి సృజనలో ప్రజలను విపరీతంగా ఆకర్షించటం వల్ల అతనికి ఆ గుర్తింపు వచ్చింది తప్ప ఆరంభంలోనూ, అవకాశం ఉన్నప్పుడల్లా అత్యంత సృజనాత్మకమైన రీతిలో, అత్యంత మధురమైన బాణీలను బప్పీలహరి సృష్టించాడని తెలుస్తుంది. అయితే డిస్కో జిలుగు వెలుగుల ముందు ఈ మధురమైన బాణీలు చీకటిలో మిగిలిపోయాయి. గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే, బప్పీ ఎప్పుడు మధురమైన బాణీని సృజించినా లతా మంగేషర్కర్ పై ఆధారపడ్డాడు తన మధురమైన బాణీకి ప్రాణం పోసి అమరం చేసేందుకు.

లతా మంగేష్కర్, బప్పీలహరి తండ్రి అపరేష్ లహరికి సన్నిహితురాలు. బప్పీని చిన్నప్పుడు ఎత్తుకుని ఆడించింది. ఆశీర్వదించింది. బప్పీ మూడేళ్ల వయసులోనే తబలా వాయించాడు. తల్లిదండ్రుల వద్దనే సంగీతంలో శిక్షణ పొందాడు. ప్రఖ్యాత గాయకుడు కిషోర్ కుమార్ అతనికి 'మామ' వరుస అవుతాడు. బాల్యం నుంచీ సంగీత వాతావరణంలో పెరిగాడు. ఇంకా చిన్నపిల్లవాడిగానే ఉన్నప్పుడు కిషోర్ కుమార్ సినిమా 'బఢ్తీ కా నాం దాడీ 'లో తబలా వాయించే హాస్య పాత్రలో నటించాడు. పదిహేడేళ్ల వయసులో 'దాదు' అనే బెంగాలీ సినిమా సంగీత దర్శకుడిగా సినీ సంగీత సృజన జీవితాన్ని ఆరంభించాడు. సంగీత దర్శకుడిగా , గాయకుడిగా, గేయ రచయితగా పేరు సంపాదించాడు.

హిందీ సినిమాల్లోకి 'నన్‌హా షికారీ' సినిమాతో రంగ ప్రవేశం చేశాడు. ఆరంభంలో రఫీ, లతాలతో చక్కటి పాటలు పాడించాడు. నథింగ్ ఈజ్ ఇంపాజిబుల్, సాథిరే గం నహి కర్‌నా , మాథేకి బిందియా బోలే వంటి మధురమైన గీతాలను రఫీకోసం రూపొందించాడు. బప్పీ రంగ ప్రవేశం చేసిన అయిదేళ్లకే మహమ్మద్ రఫీ లోకం నుంచి నిష్క్రమించాడు. అంతలోనే రఫీతో 13 అత్యద్భుతమైన పాటలు పాడించాడు. అందుకే 'ఏయ్ దిల్ హై ముష్కిల్' సినిమాలో రఫీ గురించి చులకన సంభాషణ ఉంటే బప్పీలహరి తీవ్రంగా ఖండించాడు.

కిషోర్ కుమార్ పాట 'చల్తే చల్తే మెరె యే గీత్ యాద్ రఖ్‌నా' పాటతో ఖ్యాతి నార్జించినా, లతా పాట 'ఆవొ తుమ్హే చాంద్ పే లేజావూ ' పాటతో మధురమైన గీతాల సృజనకర్తగా గుర్తింపు పొందాడు. లతా మంగేష్కర్ ఆ కాలంలో లక్ష్మీకాంత్ ప్యారేలాల్‌లను అధికంగా ప్రోత్సహించేదని అందరూ అంటారు. కానీ, లక్ష్మీ ప్యారేతో పాటు, బప్పీలహరీ కోసం కొన్ని రికార్డింగ్ తేదీలను లత నెలలో ప్రత్యేకంగా అట్టిపెట్టుకునేదన్న విషయం చాలామందికి తెలియదు. దాదాపుగా ఆరు దశాబ్దాలు లత అగ్ర స్థానంలో ఉండటం వెనుక, భవిష్యత్తులో విజయం సాధించగల సంగీత దర్శకులను ఆరంభంలోనే గుర్తించి, వారిని ప్రోత్సహించటం ఉంది.. దాంతో లతా మంగేష్కర్ పట్ల జీవితాంతం కృతజ్ఞులుగా ఉండటమే కాదు, వారు ఏదైనా ట్రెండ్ సృష్టించి విజయ శిఖరం అధిరోహిస్తే, ఆ శిఖర శృంగం పైన వారితో పాటూ లత కూడా ఉండేది. లక్ష్మీ ప్యారే, రాజేష్ రోషన్, కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ, ఆర్డీబర్మన్, బప్పీలహిరిలతో పాటు జతిన్ లలిత్ , అన్ను మాలిక్ వంటి తరువాత తరం దర్శకులను కూడా ఇలానే ప్రోత్సహించింది లతా మంగేష్కర్. ఈ యువదర్శకులు ఊహ తెలిసినప్పటినుంచీ లతపాట వింటూ పెరిగినవారు. అలాంటి లతా మంగేష్కర్ తమను ఆశీర్వదించి ప్రోత్సహించటం వారు దేవత వరమిచ్చినట్టే భావించటం స్వాభావికం. అందుకే వారు నాణ్యతపరంగా ఉత్తమమైన గీతాన్ని సృజించగానే లత మంగేష్కర్ ను గుర్తు తెచ్చుకునేవారు. ఎందుకంటే, లతా మంగేష్కర్ ఎలాంటివి పడితే అలాంటి పాటలు పాడదు. పాటలలో సాహిత్యం ఉండాలి. బాణీ ఉత్తమంగా ఉండాలి. దాంతో ఈ సంగీత దర్శకుల జీవితాలలో అత్యుత్తమ పాటలలో అధికశాతం పాటలు లతా మంగేష్కర్ పాటలే అయి ఉంటాయి. అందుకే బప్పీలహరి సృజించిన మధురమైన గీతాలు అనగానే ముందుగా గుర్తుకు వచ్చేవి లత పాటలే. బప్పీలహరి లతల కలయికలో రూపొందిన మధురమైన పాటలనగానే ముందుగా గుర్తుకు వచ్చేవి 'సయ్యాన్ బినా ఘర్ సూనా ', పతిత సినిమాలో 'బైఠె బైఠా ఆజ్ అయి – మేరే మన్‌మే ' పాటలు.

**బైఠె బైఠే ఆజ్ అయి మేరే  మన్‌మే**
**బన్ జావూ మై ఘూటా,  ఉడ్‌జావూ గగన్‌మే**
**ఉడ్‌జావూ గగన్‌మే, ఉడ్‌జావూ గగన్‌మే**

పతిత సినిమాలో ఆనంద్ బక్షీ రచించిన ఈ పాట  వినగానే ముందుగా లత స్వరం ఆకర్షిస్తుంది. ఆపై బాణీ ఆకర్షిస్తుంది. చెపితే తప్ప డిస్కో కింగ్ బప్పీలహరి ఇంత మధురమైన బాణీ సృజించాడని నమ్మటం కష్టం. 1980లో విడుదలయిందీ సినిమా అంటే అప్పటికి లతా మంగేష్కర్‌కు ఏభైఏళ్లపైన. కాని పాట వింటూంటే యవ్వనంలో అప్పుడప్పుడే అడుగుపెట్టిన యువతి తన చుట్టూ ఉన్న ప్రకృతిని చూస్తూ, శృంగార భావనల తొలి మాధుర్యాన్ని అనుభవిస్తూ ఆనందంతో పాడుతున్న పాట అనిపిస్తూంది. ముఖ్యంగా 'ఉడ్**జావూ** గగన్‌మే' అని అన్న ప్రతిసారీ

విభిన్నమైన భావం గోచరించేట్టు పలుకుతూ, ఒక ఆనందాన్ని, ఉత్సాహాన్ని, సంతోషాన్ని అద్భుతమైన భావాన్ని, ఆలోచనను స్ఫురింపచేయటం ఒక్క లతా మంగేష్కర్ వల్లే సాధ్యం.

**కభి ఖేలూ మై ఫూలోంసే, కభి సావన్ కే ఝూలోంసే**

**డాలి డాలీ పె మై లహరావూ,**

**బైఠె బైఠే ఆజ్ అయి మెరె మన్‌మే**

**బన్ జూవూ మై హవా, ఖోజావూ చమన్ మే**

యవ్వన ప్రాదుర్భావపు ఉత్సాహ జనిత విశృంఖల ఆనందానుభవ గీతం ఇది. ఆమెకు మేఘమై ఆకాశంలోకి ఎగిరిపోవాలని ఉందట. తరువాత పూలతో ఆడుకోవాలని ఉంది. 'సావన్ కే ఝూలే ' గమ్మత్తయిన పదం. 'సావన్ ' అంటే వసంతం.' 'ఝూలా' అంటే ఉయ్యాల. ఆమె వసంతపుటుయ్యాలలో ఊగాలనుకుంటోంది. వసంతం శృంగారభరిత మాసం. కొమ్మకొమ్మలపై ఆడాలనుకుంటోంది. అందుకే ఆమె ఇప్పుడు 'గాలి' అవ్వాలనుకుంటోంది. పవనమై తోటలో విహరించాలనుకుంటోంది. చక్కటి శృంగార భరితమైన సృజనాత్మక ఊహ. యవ్వనంలోని ఉత్సాహంతో ఏమేమో అవ్వాలనుకుంటారు. ప్రపంచం తమకోసమే ఉన్నదని అనుకుంటారు. అలాంటి భావోద్వేగాన్ని, సంరంభాన్ని ప్రదర్శిస్తుంది. 51 తిరగబడ్డట్టు అనిపిస్తుంది లత స్వరం.

**యేజో సుబహ నవేలీ హై, రైనా కీ సహేలీ హై**

**దోనో హస్కే గలే మిల్ రహే**

**బైఠే బైఠే ఆజ్ ఆయీ మేరె మన్‌మే**

**బన్ జావూ మై షా ఇస్ మధుర్ మిలన్‌మే**

సాధారణంగా రాత్రిని కష్టానికి, అజ్ఞానికి, వెలుతురును సుఖానికి, విజ్ఞానానికి ప్రతీకగా వాడతారు. కానీ ఇక్కడ పాట పాడే అమ్మాయి రాత్రింబవళ్లను స్నేహితులుగా భావించి సంధ్యా సమయాన్ని వారిద్దరు కౌగిలించుకోవటంగా ఊహించి ఆనందిస్తోంది. ఇక్కడ ఆనంద్ బక్షి ఒక గమ్మత్తయిన పదం వాడాడు. బన్ జావూ మై 'ష ' అన్నాడు.

'ష' అన్నది సంస్కృతంలో 'స్వర్గం' అన్న అర్థం ఇస్తుంది. ఉదయం, సాయంత్రం కలిసే స్వర్గం అవ్వాలనుకుంటోంది ఆమె అన్న అర్థం వస్తుంది. 'ష' అన్న పదం అరబిక్ అయితే, 'నిర్ణయం ', 'ఇష్టం ' అన్న అర్థాలు వస్తాయి. 'ఇన్షాహ్ అల్లాహ్' అంటారు. దైవాజ్ఞ ఎలా ఉంటే అలా అన్న అర్థం ఇస్తుంది. 'షా అల్లాహ్' అని కూడా ఇదే అర్థంతో వాడతారు. అంటే, ఉదయం, సాయం కలిసే అద్భుతమైన ఆ స్థలంలో ఉండటం ఆమెకు ఇష్టం అన్న అర్థం వస్తుంది. షా అంటే రారాజు అన్న అర్థం కూడా వస్తుంది.

**ఫూల్ సారే నహీ ఖల్తే, చాంద్ సబ్ కో నహీ మిల్తే**

**ధుంద్ మే కహా ఫిర్ ఉజాలా**

**బైఠే బైఠే ఆజ్ ఆయీ మేరే మనమే**

**బన్ జావూ మై దియా జల్ జావూ ఆగన్‌మే**

పూలు అన్నీ విరబూయవు. అందరికీ కోరుకున్నవన్నీ లభించవు. పొగమంచులో వెలుతురుండదు. కాబట్టి తాను దీపంలా మారి గగనంలో జ్వలించటం వల్ల అందరికీ వెలుగు నివ్వాలనుకుంటోంది ఆమె.

బప్పీలహరి పాటల్లో ఇంత మంచి కవిత్వం, ఇత గొప్ప బాణీ, అలౌకికమైన గానం ఊహించటం కష్టం. కానీ అది సాధ్యం అయ్యేందుకు కారణం లతా మంగేష్కర్. మరెవ్వరు ఈ పాట పాడినా ఈ పాట మాధుర్యం, అలౌకిక ఆనందం, ఒక ఆధ్యాత్మిక అనుభూతి ఒనకూడేదికాదు. లతాను ఇతర గాయనిలను వేరు చేసేది ఇదే. ఇతరులు అత్యద్భుతమయిన గాయనిలు. లతా సరస్వతీ స్వరూపం!!

అలాగే 1979 లో వచ్చిన 'ఆంగన్ కీ కలీ ' లో పాట వింటే కూడా ఇదే అలౌకిక ఆనందపు భావన కలుగుతుంది. అయితే పాట యవ్వన ప్రాదుర్భావంలోని ఉత్సాహ భరిత గీతంకాదు. జీవితంలోనిరాశలు అనుభవిస్తూ, నిరాశాపూరిత మనస్సుతో, ఒంటరి తనాన్ని అనుభవిస్తూ యువతి పాడే గీతం. లత స్వరం అలాగే ధ్వనిస్తుంది. భావాలను అద్భుతంగా పలికిస్తుంది. నిరాశ, దుఃఖాలు ప్రతి స్వర ప్రకంపనలో ఉట్టి పడుతూంటాయి. ఇదే స్వరం ఓ సంవత్సరం తరువాత '**బైఠే బైఠే** 'లాంటి ఉత్సాహపూరితమైన పాట పాడిందంటే నమ్మటం కష్టం. కానీ అది లత స్వరం అయితే వయసు పెరుగుతున్న కొద్దీ స్వరంలో మాధుర్యం పెరుగుతుంది.

**సయ్యాన్ బినా ఘర్ సూనా, సూనా**

**రాహీ బినా జై సె సూనీ గలియా, బిన్ ఖుష్బూ జై సె సూనీ కలియా**

**సయ్యాబినా ఘర్ సూనా.**

'సయ్యాబినాఘర్‌సూనా ' అన్నది ఒక ఠుమ్రీ. ఠుమ్రీ అన్నది ఉత్తర భారతదేశానికి చెందిన లలిత గీతాలలో ఒక ప్రత్యేక ప్రక్రియ. సాధారణంగా ప్రేమగీతం, భక్తి భావ రసస్ఫోరకాలో అయి ఉంటాయి ఈ ఠుమీలు. అధికంగా అవధి, బ్రజ్ భాషలలో ఉంటాయి. కానీ ఇక్కడ సినిమాకు ఆ ఠుమ్రీ మొదటి పాదం తీసుకుని ఉపమానాలతో పాటను కవితాత్మకం చేశాడు శైలీ శైలేంద్ర. శైలీశైలేంద్ర ప్రఖ్యాత గేయ రచయత శైలేంద్ర కొడుకు. చక్కటి గీతాలు రచించాడు. కానీ అల్పాయుష్కుడు. ఆయన రచించిన చక్కటి పాటలలో ఇదొకటి. ప్రియుడు లేకపోతే ఇల్లు శూన్యంగా ఉందట. పథికాలు లేని దారి, వాసనలేని పూలు ఎలా ఉంటాయో, ప్రియుడు లేని ఇల్లు అలా బోసిపోయి ఉందట. బప్పీలహరి పాటలలో అత్యంత కవితాత్మకమైన పాట ఇది.

అసలు ఠుమ్రీ మిశ్ర పహాడీ రాగంలో వుంటుంది.

**సయ్యాన్ బినా ఘర్ సూనా**

**సావరియా న ఆయే**

**యాద్ తిహారీ జియారా జలాయ్ మోరా**

**చైన్ జియా నహి పావే..**

సలామత్ ఆలీఖాన్ స్వరంలో ఈ ఠుమ్రీ చిరంజీవిగా నిలిచింది. ఆ ఠుమ్రీ తొలిపాదం తీసుకుని రాగాన్ని సరళం చేసి తొలి పాదం తరువాత తమదైన మార్గంలో గీతాన్ని సృజించాడు బప్పీలహరి. బప్పీ ప్రజ్ఞ, ప్రతిభ సృజనాత్మక్తలు ఇక్కడే తెలుస్తాయి.

**సూనాదిన్  కాలీ రతియా, అసువన్ సే భీగీ తకియా**

**హర్ ఆహట్ పే దరీ దరీ, రాహ తకీ మేరీ అఖియా**

**చాంద్ బినా జైసె సూనీ రతియా, పూల్  బినా జై సె సూనీ బగియా**

**సయ్యాబినా ఘర్ సూనా.**

వంపులు తిరిగే నదిలా, బండరాళ్లపై దూకుతూ, చినుకులు చినుకులుగా విస్తరిస్తున్న ముత్యాల్లాంటి నీటి బిందువుల్లా సాగుతుంది బాణి. పగల్లు ఒంటరిగా, శూన్యంగా, రాత్రిళ్లు చీకటిగా, భారంగా సాగుతున్నాయి. కన్నీళ్ళతో దిండు తడిసిపోతోంది. ప్రతి శబ్దానికి హృదయం ఝల్లుమని భీతిల్లుతోంది. అతని కోసం దారి చూస్తూ కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నాయి. చంద్రుడు లేని రాత్రుళ్లు ఎంత శూన్యంగా ఉంటాయో, పూలు లేని పూతోటలు ఎంత శూన్యంగా ఉంటాయో, ప్రియుడు లేని గృహం కూడా అలా శూన్యంగా ఉంది

**అంధియారే బాదల్ ఛాయే, కుచ్‌భీన మన్ కో భాయే**

**దేఖ్ అకేలీ ఘేరే ముఝే యాదోంకీ కాలే సాయే**

చిక్కటి మేఘాలు అలుముకున్నాయి. మనస్సుకు ఏదీ నచ్చటంలేదు. ఆమెను ఒంటరిగా చూసి జ్ఞాపకాలు దట్టంగా అలుముకున్నాయి. ఆమెను చుట్టుముట్టాయి.

ఇది ఆమె మానసిక స్థితి.

సినిమాలో వారిద్దరికీ వివాహం అవుతుంది కానీ పిల్లలుండరు. ఆమెకు పిల్లలు కావాలని ఉంటుంది. అనారోగ్యంవల్ల ఆమెకు పిల్లలు కలిగే అవకాశాలు తక్కువ. పిల్లలు కల్గకపోతే ఎవరినయినా దత్తత తీసుకోవాలనుకుంటుంది. ఓ పాప కూడా దృష్టిలో ఉంటుంది. ఈ కోణంలో చూస్తే ఆమె వాడిన ఉపమానాలు మరో అర్థాన్నిస్తాయి ఎందుకంటే 'సయ్యాన్' అంటే ప్రియుడు. కానీ 'సూనీ బయ్యాన్ సజేగీ సజ్‌నా ; అంటారు. పిల్లవాడు

పుట్టడాన్ని. పిల్లవాడిని ఎత్తుకోవటం వల్ల శూన్యంగా ఉన్న హస్తాలకు అలంకారం వచ్చినట్టు అన్నమాట. 'సూనీబయ్యా' అంటే శూన్యమైన బావులు 'సజేగా సజ్‌నా' అంటే వాటిని ప్రియుడు అలంకరిస్తాడు. ఇక్కడ వాడిన ప్రతీకలు, చంద్రుడు లేని రాత్రుళ్లు, వాసనలేని మొగ్గలు, పూలు లేని పూతోటలు అన్ని రెండు అర్థాలనిస్తాయిప్పుడు.లత స్వరం కూడా జాగ్రత్తగా వింటే ప్రియుడు లేని విరహ వేదనను ప్రదర్శిస్తూనే, సంతానం లేని దుర్భరమైన వేదనను ధ్వనింపచేస్తుంది. ఒంటరి తనాన్ని, అది జీవితమంతా అనుభవించాల్సిన ఒంటరి తనం ధ్వనింపచేస్తుంది. తన ప్రియుడు సరసన వున్నా తీర్చలేని లోటు అది. అత్యద్భుతమైన గాన సంవిధానం ఇది. సందర్భం ఎలా అర్థం చేసుకుంటే అలాంటి భావం స్ఫురింపచేయటం సామాన్యమైన విషయం కాదు.

ఇప్పుడు భూపేంద్ర రంగ ప్రవేశం చేస్తాడు.

**అసూ యూన్ న బహావో, యే మోతీన లుటావో**
**రుక్తీ నహీ హై వక్త్‌కి ధారా, పల్ పల్ బద్లే యే జగ్ సారా**
**జైసె ఢలేగీ రాత్ అంధేరీ, ముస్కాయేగా సూరజ్‌ప్యారా**
**సుఖ్ కె లియే పడె దుఃఖ్ భీ సహెనా**
**అబ్ న కభీ ఫిర్ తుం యే కహెనా**
**సయ్యాన్ బినా ఘర్ సూనా...**

శైలేంద్ర గేయ రచన సంవిధానం ఇది. అయితే శైలేంద్ర ఇంకా అలతి పదాలతో, ఇంకా చిన్న వాక్యాలతో, ఇంకా లోతయిన అర్థాన్ని పొందు పరుస్తాడు. ఆ బాటలోనే ప్రయాణించాలని శైలీ శైలేంద్ర ప్రయత్నించాడు.

కన్నీళ్లు వ్యర్థంగా కార్చవద్దు. ఈ ముత్యాలను వ్యర్థం చేయవద్దు. ఈ సమయ ప్రవాహం ఎవరికోసం ఆగదు. క్షణ క్షణానికి ప్రపంచం మారిపోతుంది. రాత్రి అంతం అవటంతోటే ఆనందాల్నిస్తూ సూర్యుడు ఉదయిస్తాడు. సుఖం ఆశించేవారు దుఃఖాన్ని భరించేందుకు సిద్దంగా ఉండాలి. కాబట్టి మరోసారి ప్రియుడు లేని ఇల్లు శూన్యం అనవద్దు అంటున్నాడు నాయకుడు. గొప్ప జీవిత సత్యం చెప్పాడు. సుఖం కావాలంటే దుఃఖాన్ని అనుభవించే శక్తి ఉండాలి. కష్టం వస్తే బెదరవద్దు. చీకటి తరువాతనే వెలుతురు వస్తుంది. ఈ ప్రపంచంలో వెలుగునంటి నీడ వున్నట్టు సుఖం వెంటే దుఖం వుంటుంది. కాబట్టి సుఖం కావాలంటే దుఖాన్ని భరించేందుకు సిద్ధంగా వుండాలి.

పాట చిత్రీకరణ కూడా చక్కగా ఉంటుంది. పెద్ద ఇంట్లో ఆమె ఒంటరితనాన్ని ప్రేక్షకులకు ప్రదర్శిస్తాడు. పాటను రూపొందించిన విధానం, సంగీత వాయిద్యాల నిర్దేశనంలో బప్పీ ప్రతిభ తెలుస్తుంది. ముఖ్యంగా నాయకుడు వచ్చిన తరువాత నాయిక అంతరంగ ప్రతిధ్వనిని సరోద్ సంగీత వాయిద్య ప్రకంపనల రూపంలో ప్రదర్శించిన తీరు అద్భుతం. ఇంతటి సృజనాత్మక సంగీత దర్శకుడు 'డిస్కో కింగ్' గా గుర్తింపు పొంది, సినీ సంగీతాన్ని దిగజార్చిన వాడుగా

పరిగణనకు గురవటం 'విధి' తప్పించి మరొకటికాదు. ఇక లత 'సయ్యాబినా' అని ఎన్నిసార్లంటుందో అన్ని విధాలుగా పలుకుతుంది. 'సూనా సూనా' దగ్గర వేసిన అలంకారాలు పాట స్వరూపాన్నే మార్చేస్తాయి. లత గాన సంవిధానాన్ని పొగిడేందుకు పదాలు లేవు. అది అనుభవించి తీరాల్సిందే. అందుకే లత మరణించినప్పుడు దుఃఖిస్తూ బప్పీలహరి 'అందరూ ఆమెను సరస్వతి ప్రతిరూపం అంటారు. నేను ఆమెనే సరస్వతీమాత అంటాను. ఆమె మరణంతో నేను మరోసారి మా అమ్మని కోల్పోయాను. చిన్నప్పుడు ఆమె ఒళ్లో ఆడుకున్నాను ' అంటూ దుఃఖించాడు.

అదృష్టవశాత్తు బప్పీకన్నా ముందు లత మరణించింది. ఇప్పటికే ఆమెతో కల్సి పాడిన వారందరూ మరణించారు. ఆమెకు సంగీత దర్శకత్వం వహించిన వారు మరణించారు. ఆమెతో కలసి ఎదిగిన వారు మరణించారు. ఆమె ఆశీర్వాదం అందుకుని ఆమె ఎదురుగా ఎదిగిన వారు మరణించారు. ముఖ్యంగా, లతా మంగేష్కర్ వాళ్లమ్మ మరణించినప్పటి నుంచీ ఒంటరిదయిపోయింది. పాటలు తగ్గించుకుంది. అందరితో కలవటం తగ్గించింది. ఒకరొకరుగా వెళ్లిపోతూండటం ఆమెను తీవ్రంగా బాధిస్తూ వచ్చింది. దిలీప్ కుమార్ మరణంతో ఆ తరంతో ఆమెకు పూర్తిగా సంబంధం తెగిపోయింది. బప్పీ మరణం ఆమెను తీవ్రంగా గాయపరిచేది. అందుకే, బప్పీకన్నా ముందు లత వెళ్లిపోవటం గుడ్డిలో మెల్లలాంటిది.

కళాకారుడి మరణం అతని కళను మరింతగా అనుభవించి ఆనందించేందుకు ఆరంభం కావాలి. భౌతికంగా వ్యక్తి లేరన్న బాధ ఉన్నా, వారు సృజించిన కళద్వారా వారు జీవించే ఉన్నారని, వారి కళను అనుభవించి ఆనందించటం ఆ ఆనందాన్ని పదిమందికీ విస్తరించటం ద్వారా కళాకారుడి కళను, తద్వారా కళాకారుడిని సజీవంగా నిలపటంలో మన బాధ్యత నిర్వహించాలి. ఇదే కళాకారుడికి అత్యుత్తమ నీరాజనం. కళాకారుడికి ఇవ్వగలిగిన అతి చక్కని నీరాజనం. అందుకే 'చల్తే చల్తే మెర యే గీత్ యాద్ రఖ్‌నా, కభి అల్విద న కహెనా' అన్నది బప్పీకి కాదు ప్రతి కళాకారుడికీ వర్తిస్తుంది. భౌతికంగా వారు విడిచి వెళ్లినా మనం వారి కళకు 'అల్విదా' ఎన్నటికీ చెప్పం, చెప్పలేము.

**వచ్చే నెల మరిన్ని మధురమైన గీతాలతో...**

Post your comments